# కథ


సి.పి.బ్రౌన్ అకాడమీ - నవ్యవీక్లి కథల పోటీ

సాధారణ ప్రచురణ (రూ. 1,000)కు ఎంపికయిన కథ

# మునిదేవర

- పలమనేరు బాలాజీ

***''ఒకటంటే ఒక చిన్న తెల్ల మచ్చ కూడా కంటికి కనపడ గూడదు. బాగా గెవనం పెట్టుకోండి. పట్టుకుని వొచ్చేసినాక మట్టెన్న మామ వంక పెట్టినాడంటే మళ్ళీ మీరు దాన్ని యాడన్నా అమ్ముకోవాల్సిందే. ఇక తెల్ల ఎంట్రుక కూడా లేని నల్ల మేకపోతు కావల్ల. అర్థమైందా?'' అప్పటికది ఐదోసారో ఆరోసారో టెంకాయల క్రిష్ణప్ప హెచ్చరించడం.***



టౌన్ చివర ఇస్మాయిల్ టీ అంగడి దగ్గర నిలబడి టీలు తాగినాక బీడీలు తాగుతూ, వక్కాకు నములుతూ గుంపుగా నిలుచున్న వాళ్ళు ఎనిమిది మంది.

''మీరంతా బిరిన్నే ఎలబారి పొండి. సాయంకాలమైపోతుండాది. తలా ఓ దిక్కులో పొండి. ముందు యాడైనా నల్ల మేకపోతు వుండాదేమో చూసి చెప్పినాక రేటు మాట్లాడుకోని అడ్వాన్సు ఇచ్చేసి మాట చేసుకుని వచ్చేయండి. ఇంకెవురికైనా యాడన్నా నల్ల మేకపోతు దొరికిందేమో మన మీద అడ్వాన్సు దుడ్లు ఇచ్చేస్తే ఎట్లా అని ఎవురు పాలు యారకండి. యాభై రూపాయలు పోయినా పర్వా లేదు. యాడ గురి కుదిరితే ఆడ అడ్వాన్సు ఇచ్చేసి వచ్చేయండి. ఎన్ని కేజీలుంటదో చూసుకుని మళ్ళింక ఎక్కడ కొనాల్నో అక్కడకు నేనూ వస్తా. దాని దిట్టం చూసి కొందాం లే'' మరికొన్ని హెచ్చరికల్ని జారీ చేస్తున్న క్రిష్ణప్ప వైపు విసుగ్గా చూశాడు బండి గోవిందు.



"ఏంది మామా. చెప్పిందే చెప్తా వుండావు. అదే పనిగా ఈ పిలకాయలకి బండ్లుండాయి. వీళ్ళు నలుగురు ముందు కూర్చుని బండ్లు తోలతా వుంటారు. స్కూటర్లకు ఎనకాల కూర్చుని దారి చూపించే దానికి, అక్కడక్కడా నల్లమేకపోతు యాడుండాదో వెతికే దానికి మనోళ్ళే నలుగురు వుండాం కదా. మాకు తెల్సు కదా పనంతే. అయినా మేకల దొడ్డి కాడికి పోయి నల్ల మేకపోతు కావల్ల అనంటానే వాళ్ళే అడగలేరు కదా మునిదేవరకా అని. వాళ్ళ దగ్గర మనకు కావాల్సింది ఉండాదో లేదో ఎమ్మట్నే వాళ్ళే చెప్పేస్తార్లే. మనం మందంతా ఎతికే పని కూడా లే. ఊర్లోకి పోయి మునిదేవరకి మేకపోతు కావల్ల. నల్లది అని అడిగితే సాల్లే. ఊర్లో యాడున్నా ఊర్లో వాళ్లు చెప్పేస్తార్లే" పనిలోని సుళువుని, మెలకువల్ని చెప్పుకొచ్చాడు బండి గోవిందు.

"ఊర్లో మాత్రం అడిగితే సరిపోదు గోవిందూ. సేద్యం చేసే చోట కాపరాలుండే వాళ్ళని కూడా విచారించుకుని రావల్ల. నువ్వేం నీ ఎద్దుల బండి పైన కాదు పోతాండేది. ఎద్దు అలసిపోయిందనే దానికి. స్కూటర్ పైన పోతుండావు. పిలకాయలు చూడు. హుషారుగా వుండారు. నాలుగూర్లు ఓపిగ్గా తిరిగి రాపో. పాలు మార్దద్దు" బీడీ ముట్టించుకుంటూ అన్నాడు క్రిష్ణప్ప.

అతడు అక్కడే కాస్సేపు వుండి, నాలుగు స్కూటర్లు ఎనిమిది మంది కదిలే దాకా చూసి అక్కడి నుంచి ఇంటివైపుకు నడక సాగించాడు.

"నువ్వు ఎద్దులబండి తోలతావాన్నా. ఈ కాలం ఆటోలు, మినీ లారీలు వచ్చినంక కూడా ఇంకా ఎద్దుల బండ్లుండాయా? నీకు ఏమైనా గిట్టుబాటు అవుతోందా? ఈ ఊర్లో" కుతూహలంగా అడిగాడు మహేష్.

తిరుపతిలో డిగ్రీ చదువుతూ సెలవుల్లో అరుణ్ వాళ్ళింటికి వచ్చాడు. అరుణ్ వాళ్ళింట్లో ఆదివారం ఏదో పండుగ వుందన్నాడు. కానీ మునిదేవర అంటే ఏమిటో, దానికి నల్లమేకపోతుకి సంబంధం ఏమిటో అతడికి ఇంకా పూర్తిగా తెలియడం లేదు. అడిగి వివరాలు తెలుసుకుందామంటే మిత్రులందరూ చెరో దార్లో బయలుదేరటం వల్ల అదే వీలు కావటం లేదు.

లుంగీని సర్దుకుని జరిగి కూర్చుంటూ గోవిందు కిసుక్కున నవ్వాడు. తార్రోడ్డు నుంచి ఎడమ చేతి వైపుకు తిరగాలని ఎడమ చేత్తో దారి చూపిస్తూ మళ్ళీ నవ్వాడు. స్కూటరు ఎడమ వైపుకి తిరిగింది. అది అవటానికి తార్రోడ్డు కానీ అక్కడక్కడా పైకి రాళ్ళు కనపడుతూ వున్నాయి. గుంతలు పడివున్న రోడ్డు పైన ఏకాగ్రతతో స్కూటర్ నడుపుతూ "ఏందన్నా అట్ల నవ్వినావు" అన్నాడు మహేష్.

"ఏంలేదు అబ్బోయా. ఇమానాలు వొచ్చినాయి గదాని జనాలు సైకిళ్ళు ఇడిసిపెట్టినారా చెప్పు? నా ఎద్దుల బండి కత కూడా అంతే. అసలు మా కుల విద్య అదికాదు కదా" అని కాసేపు మౌనంగా వుండిపోయాడు గోవిందు.

## రచయిత పరిచయం



స్వస్థలం: పలమనేరు. వృత్తి: పంచాయితీ రాజ్ శాఖలో 15 సంవత్సరాలుగా ఉద్యోగం. ప్రస్తుతం ఎంపీడీవో పెద్దపంజాణి, చిత్తూరు జిల్లా. ప్రవృత్తి: కథలు, నవలలు రాయడం. 40 దాకా కథలు, 3 నవలలు ఎంపికయ్యాయి. చతురలో 'నేల నవ్వింది' నవలకు ప్రోత్సాహక బహుమతి లభించింది. ఆంధ్రప్రభ, ఎవికెఎఫ్ దీపావళి కథల పోటీలో 'అంతర్దర్శనం' కథకు బహుమతి. 'మాటల్లేని వేళ' కవితాసంపుటి వెలుగు చూసింది. కథలు, కవితలు, వ్యాసాలకు అనేక బహుమతులు లభించాయి. 2007లో ఎక్స్‌రే ఉత్తమ కవితా పురస్కారం, సిలికానాంధ్ర ఉగాది కవితల పోటీలో తృతీయ బహుమతి, 3 సార్లు అంతర్జాతీయ కవి సమ్మేళనంలో పాల్గొనడం మరపురాని అనుభూతి. కొన్ని కవితలు ఆంగ్లంలోకి, కన్నడంలోకి అనువాదం అయ్యాయి. 'మునిదేవర' కథని సాధారణ ప్రచురణకి ఎంపికచేసిన సి.పి.బ్రౌన్ అకాడమీ- నవ్య వీక్లికి ధన్యవాదాలు.

-పలమనేరు బాలాజీ

ఆ మౌనం ఎందుకో అర్థంకాక మహేష్ నోరు తెరచి ఏదో అడగబోయేంతలో గోవిందు నోరు తెరిచాడు.

"అవును అబ్బయా, ఇంతకీ మా అరుణోళ్ళు ఏ కులమో నీకు తెల్సునా తెలీదా. అది తెలీకుండానే నేను ఏందేందో వాగతాండాను. ముందీ సంగతి చెప్పు. మా కులం గురించి అరుణ్ నీకు ఏమని చెప్పినాడు"

"ఇంతకీ మాదే కులమనుకుంటావుండావన్నా నువ్వు. నన్ను చూస్తావుంటే ఏమనిపిస్తాండాది నీకు"

మహేష్ ప్రశ్నతో గోవిందు క్షణ కాలం తత్తరపడిపోయి, తర్వాత తేరుకుని "రెడ్డోళ్ళు లేదా కమ్మోళ్ళ మాదిరి కనిపిస్తావుండావు అబ్బయా. కరెక్టేనా నా అంచనా" అన్నాడు పరీక్షగా మహేష్ వైపుకు కొంచెం ముందుకు వంగి పరీక్షగా చూస్తున్నట్లు చూస్తూ.

"అదేందన్నా అట్లంటా వుండావు. ఆ లెక్కన అరుణ్‌ని చూస్తే కూడా అట్లే అనిపించాలి కదా. మనిషిని చూడగానే వాని కులం తెలిసిపోయేటట్లు వాని మొహం పైన యాద్దైనా పేరు రాసి పెట్టుంటుందా" మహేష్ గొంతులోని కోపం, బాధ అర్థమైనాయి కానీ గోవిందు మరి నోరు తెరిచే ప్రయత్నం చేయలేదు.

కాస్సేపు ఇద్దరూ మౌనంగానే వుండిపోయారు.

"పెద్ద పెద్ద కులమోళ్ళ పిల్లలయితే చూడ్డానికి బావుంటారని, వాళ్ళకే తెలివి తేటలు ఎక్కువగా వుంటాయని అనుకుంటే ఎట్లన్నా. అరుణ్ ఎస్‌టి అని ఎరుకల అనీ తెలుసు. మేము మగ్గం నేసే తోళ్ళం, సాలోళ్ళం"

"సాలోళ్ళా" అసంతృప్తి ధ్వనించింది గోవిందు గొంతులో. దాన్ని గమనించాడు మహేష్.

"పెద్ద కులం చిన్నకులం అని కులంలో తేడా లేకపోయినా ఒక మాట అడగతాను. నువ్వేం అనుకోకూడదు. ఏం రా ఈ అబ్బాయి ఇట్లా అడిగేడే అని" క్షణం ఆగి, "అడిగేయ్‌నా అన్నా" అన్నాడు మహేష్.

తుండుగుడ్డతో మొహం తుడుచుకుని మెడ చుట్టూ తుండుగుడ్డని చుట్టుకుంటూ "అడుగు అబ్బాయా. నేనేం అనుకోనులే" అన్నాడు ఏదో ఆలోచిస్తూ.

"ఎవరో పై కులపోళ్ళు కిందకులాల్ని నీచంగా చూస్తారంటే అది వేరే విషయం. ఎస్‌సిలు, ఎస్‌టిలు, బి.సీ.లు కూడా వెనుకబడిన సాటి కులపోళ్ళని తక్కువగా చూడ్డం మంచిదేనా? ఎవునికి వానికి వాని కులం గొప్పగానే వుండల్ల. వుంటుంది. మనుషులందరికీ కాళ్ళు, చేతులు సమానంగానే వుంటున్నప్పుడు మనుషుల మధ్య ఈ కులాల పేరుతో జరిగే హెచ్చు తగ్గులెందుకన్నా. నీ కతే ఎత్తుకో, సాలోళ్ళా..అనేస్తివి. ఏమన్నా సాలోళ్ళు మనుషులు కదా. ఎందుకన్నా మనల్ని మనమే తక్కువ చేసుకుంటా వుంటాం? పల్లెటూర్లు అట్లనే వుండాయి. కాలేజీలు అట్లనే వుండాయి. మా కులం ఇదని గొంతు విప్పి చెప్పుకోవాల్లంటే కూడా అదేదో తప్పు చేస్తున్నట్లు భయపడి పోతావుంటం కాలేజీల్లో. మీరంతా మారాలన్నా. మీరు మాత్రమే కాదు. మనమంతా మారాలే"

స్కూటర్ హ్యాండిల్ పైన మహేష్ చేతులు బిగుసుకున్నాయి. స్కూటర్ వేగంగా ముందుకెడుతోంది.

తలను అటూ ఇటూ తిప్పకుండా ఏకాగ్రతగా స్కూటర్ నడుపుతూ మహేష్ "ఏమంటావన్నా మాట్లాడు. మనుషులు మాట్లాడకుండా వుండటం నేరం. మనుషులు మాట్లాడాలన్నా నువ్వేం అనుకుంటా వుండావో చెప్పు. ఇంతకు ముందు మీ కులం పనుల గురించి చెప్తా చెప్తా ఆగిపోతివి కదా. అది కూడా చెప్పు" అన్నాడు.

మరోసారి సర్దుకుని కూర్చున్నాడు గోవిందు. అతడికి ఆ క్షణం ఎందుకో చిన్నతనంగా అనిపించింది. అరచేతి వేళ, గోర్లని చూస్తూ గొంతు విప్పాడు.

"నువ్విట్లా ముఖం మీదనే అనేసినంక నేనేం మాట్లాడేది అబ్బాయా. మా పిలకాయలు డిగ్రీలు

చదవతా వున్నా, ఇంకా ఆపైన చదవతా వున్నా మా కులం ఇదీ అని ధైర్యంగా చెప్పుకునే వాళ్లు కొంతమందే. చాలా మందిని గమనించినా. చదువు కుంటా వుండేవాళ్ళు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుంటా వుండేవాళ్ళు. చాలామందిని చూసినా. కులం పేరు బయటకు చెప్పుకుని భయం లేకుండా బతుకుతా వుండాది కొంతమందే. చాలా మంది ఏదేదో కులాల పేర్లు చెప్పుకుంటా వుంటారు. అందుకని మా అరుణ్ గాడు మీతో ఏ కులమని చెప్పినాడో నాకు తెల్దుకదా. అందుకిన మాట తడబ డిందిలే'' అని ఆగి తుండు గుడ్డని తలకి బిగించు కుని కొనసాగించాడు.

''ముందు నుంచి అట్లా అలవాటయిపోయింది గదా అబ్బయా. ఇప్పుడు మారాలంటే కష్టం. నువ్వు చెప్పేదీ నిజమే కదా. అదీ గాక మనల్ని తక్కువ చూపు చూస్తావుండారని అనుకున్నప్పుడు ఇంకెవరన్నా మనం తక్కువగా చూడ్డంలో ఏదో తృప్తి వుండాదనుకుంటా. ముందు నుంచి పాత తరం నుంచి అట్లా వచ్చేసిండాలిగదా. ఇంక మారాలా. అయినా జనాలు మారతా వుండారు. ఇంకా మారాలే. మా కులంలో ఈ పనులన్నీ ముందెప్పుడు తెలిసింది చెప్పు. దబ్బులల్లటం, బుట్టలు చెయ్యడం, ఎర్రమన్ను అమ్మటం, ఆడాడా తిరిగి పందుల్ని పెంచటం, బాతుల్ని పెంచటం కదా కదా తెల్సు మాకు. సోది చెప్పటం కదా మా ఆడోళ్లకు ముందు తెలిసింది''

''సోది అంటే ఏందన్న'' గోవిందు మాటలకు అడ్డొచ్చాడు మహేష్.

సాయంత్రపు చలిగాలి ఉండుండీ వీస్తోంది. వెలుతురు ఇంకా పూర్తిగా పలచబడలేదు అప్పటికి. స్కూటర్ తన మానాన తాను వెడుతోంది. మధ్య మధ్యలో ఎటు తిరగాలో, ఎటు వెళ్ళాలో గోవిందు చెబుతూ వున్నాడు.

''నువ్వు బీడీ, సిగరెట్ తాగవా'' అడిగాడు గోవిందు బీడీ ముట్టించుకుంటూ.

''మా ఫ్రెండ్సులో ఎవురికీ అలాంటి అలవా ట్లేవి లేవన్నా. పాన్‌పరాగ్‌లు, కిళ్ళీలు, సిగరెట్లు, బూతు సినిమాలు, షికార్లు, పోరంబోకులతో తిరు గుళ్ళు..కాలేజీ పిల్లోళ్ళు చదివి బాగుపడాలంటే వీటికి దూరంగా ఉండాల్సిందే. తిరుపతిలో అన్నీ దొరుకుతాయి. బాగు పడాలంటే చదువొక్కటే మార్గం. మనిషి చెడిపోవాలంటే సవాలక్ష మార్గాలు కదన్నా''

మహేష్ మాటలకు సంతృప్తిగా అవునన్నట్లు తలాడించాడు గోవిందు. సైడ్ మిర్రర్‌లో కనపడు తున్న తన మొహాన్ని తదేకంగా చూసుకుంటూ గోవిందు అన్నాడు.

''పట్టు పట్టి చదివితే చదువులో కష్టమేముండ దని ఇప్పుడిప్పుడు తెలుస్తా వుండాది కానీ, మాలో చాలా మందికి ఆ కాలం చదువంటే చాలా కష్టమని పించేది. అదీ కాక చదువుకోమని చెప్పే వాళ్ళెవు రు? కడుపాత్రం నానా రకాల పనులు నేర్చుకుని తిండికి జరుగు బాటయితే చాలనుకునే పరిస్థితి గదా మాది. నా కొడుకులిద్దరికీ చదువు వంట బట్టలే. నేనూ చదవమని గట్టిగా చెప్పలే. ఇద్దరూ టౌన్లు చేరిపోయినార్లే. ఒకడు మైక్‌సెట్ అంగడి పెట్టుకోనుండాడు. ఇంకొకడు కరెంటు పనికి పోతా వుండాడు. వాళ్ళు చదువుకోలేదు కానీ వాళ్ళ పిలకా యల్ని మాత్రం కాన్వెంట్లకి పంపిస్తావుండార్లే'' ఆ గొంతులో గర్వం తొంగి చూసింది.

''ఇక్కడే.. ఇక్కడే ఆపేయ్ అబ్బాయా..బండి'' స్కూటర్‌ను అక్కడే ఆపి పల్లెలోపలికి నడిచారు ఇద్దరూ.

* * *

అరుణ్ వాళ్ళింటి ముందు పందిరి వేసి ఉంది. షామియానా కింద వేసిన కుర్చీలు చాలా వరకు నిండిపోయి వున్నాయి.

భజంత్రీలు హడావిడిగా వున్నారు. పిల్లలు కొందరు గుంపులు గుంపులుగా చేరి ఆటలాడు కుంటున్నారు. అరుణ్ వాళ్ళ అన్నయ్య పిల్లలిద్దరికీ కొత్త బట్టలు వేసి మెడలో పూల మాలలు వేసి ముందు వరుసలో నిలబెట్టారు. వాళ్ళ వెనకాల వాళ్ళమ్మ కాబోలు తట్టలో పూజసామాగ్రి పెట్టు కుని నిలబడి వుంది. ఆడవాళ్ళు కొంతమంది గంపలు నెత్తి పైన పెట్టుకుంటే, ఇంకొందరు విశాల మైన పైజ పళ్ళాలను మోస్తూ నిలబడి వున్నారు.

అందరికంటే ముందు తల విదిలిస్తూ బెదురు చూపులతో నల్లమేకపోతు నిల్చుని వుంది. దాన్ని కడిగి పసుపు కుంకుమ పెట్టి మెడలో పూలహా రాన్ని వేసి దిష్టి తీశాక ఊరేగింపు బయల్దేరింది.

రాజేంద్ర, కపాళి, మునిరత్నం, టెంకాయల క్రిష్ణప్ప, బండి గోవిందు, విక్రమ, సుబ్రహ్మణ్యం మొదలైన వారంతా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తు న్నారు. అరున్, అతడి మిత్ర బృందం మరో గుంపుగా బయలుదేరారు.

''మొత్తానికి మన మహేష్‌కు గోవిందు మామకు ఎట్లానో మనకు కావాల్సిన నల్లమేక పోతు దొరికింది కాబట్టి సరిపోయింది. కానీ లేదంటేనా చాలా గందరగోళం అయ్యేది. ముని దేవర వాయిదా పడుండేది. మిగతా ముగ్గురికీ దొర కనిది మహేష్‌కు దొరకటం ఆశ్చర్యంగా వుందిరా'' అన్నాడు అరుణ్ మహేష్ వైపు ముచ్చటగా చూస్తూ.


''నాదేముందిరా బండి నడపటమే కదా. మీ మాముండాడే గోవిందు చాలా గట్టోడు. నన్ను మాటల్లో బెట్టి మొత్తం పన్నెండు మార్లు తిప్పినాడు కదా. కడకు రాత్రి పదిగంటలప్పుడు తెల్ల మచ్చ లేని నల్లమేకపోతు దొరికినప్పుడు చూడల్ల ఆ గోవిందన్న మొహం. వెలిగిపోయిందనుకో. బేరం కూడా చేయలే. అయినా వీటికి అంత డిమాండ్ ఉందని మనకెవరికీ తెలియదు మొన్నటి దాకా'' నోట్లో ఏమిటో నములుతూ అన్నాడు మహేష్ .

మేళతాళాలతో ఊరేగింపు కదిలి పాత చెరువు పక్కన వున్న పెద్దమర్రి మాను వద్దకు చేరుకుంది. అప్పటికే కొంతమంది అక్కడకు ముందుగా చేరి, వీళ్ళ కోసం ఎదురుచూస్తూ కనిపించారు.

బొరుగులు, చెనిగ పప్పు, బెల్లం, బిస్కెట్స్, చాక్లెట్స్, పిప్పరమెంట్లు కలిపిన ప్రసాదాన్ని నైవే ద్యంగా వుంచి అగ్గార్లకు మొక్కుకున్నారు. అక్కడు పరమాన్నం వండారు.

''ఏమిట్రా అది'' అని మహేష్ అడుగుతుంటే గట్టిగా మాట్లాడవద్దంటా నోటి పైన వేలేసుకుని సైగ చేసి చెప్పాడు అరుణ్. అక్కడికి కొంచెం దూరంగా నడిచి కాలువ పక్కలో పచ్చగడ్డి పైన కూర్చున్నాక గొంతు విప్పాడు.

''పిల్లలికి మూడో సంవత్సరంలోగా మునీశ్వ రుడికి తల వెంట్రుకలిచ్చి, మేకపోతును, కోడి పుంజును, కోడిపెట్టను బలిచ్చే పండగరా ఇది. మునిదేవర అనంటారు. అక్కడ చూడు. ఇంతవ రకూ మనం మొక్కింది అగ్గార్లకే. అంటే అక్కగార్ల కని అర్థం. అక్కగార్లు గ్రామ దేవతలు. ఊరి పొలి మేరల్లో వుంటూ ఊర్లోని వాళ్ళకు ఏ చెడూ జర క్కుండా, ఊర్లోకి వినాశకర శక్తులేవీ ప్రవేశించ కుండా కాపలా వుంటాయట. మా తాత చెప్తావున్నాడు ఆకథలన్నీ. అక్కడ చూడండి ఏం



చేస్తున్నారో'' అతడు చేయి చూపించిన వైపుకు తలలు తిప్పారు అందరూ.

''మట్టితో మునీశ్వరున్ని తీర్చిదిద్దుతున్నారు. చూడండి ఎంత పెద్ద విగ్రహమో చూడండి'' అంటున్నాడు అరుణ్.

రాజేంద్ర, మట్టెప్ప, టెంకాయల క్రిష్టప్ప ముగ్గురూ కలిసి మట్టితో శ్రద్ధగా మునీశ్వరున్ని నేల పైనే కొలువు తీర్చారు. పసుపు కుంకుమ, విబూదితో, రంగు రంగు పూలతో అలంకరించారు. ఆ సరికి ఇంకొంతమంది జనం అక్కడకు చేరిపోయారు. వచ్చిన వాళ్ళందరి చేతుల్లో రంగు కాగితాలు చుట్టుకున్న బహుమతులు నలిగిపోతున్నాయి. ఎండ చుర్రున కాస్తుంటే దాహం తీర్చడానికన్నట్లు మంచి నీళ్ళు అందిస్తున్నారు ఇద్దరు. చాపలు, దుప్పట్లు, జంపఖానాల పైన కూర్చున్న జనం పిల్లల్ని సముదాయిస్తూ మంచినీళ్ళు తాగిపిస్తున్నారు.

అక్కడేదో జాతర జరుగుతున్నట్టు వుంది వాతావరణం. ''వీళ్ళంతా ఎవరు?'' చుట్టూ పరిశీలనగా చూస్తూ సందేహంగా అడిగాడు మహేష్. అరుణ్ మెల్లిగా నవ్వాడు.

''కులం గురించి ఎవురికీ చెప్పుకోని వాళ్ళు ఇక్కడ చాలా మందే వుండారు చూడు. ఉద్యోగాలు, వ్యాపారాలు చేసుకుని అంతో ఇంతో వెనకేసుకోనుండే చాలా మంది వాళ్ళు ఎరుకలోళ్ళని చెప్పుకోవటానిక్కూడా నామోషీ పడతా వుంటారు. వాళ్ళ ఉద్యోగాలకి, వాళ్ళ చదువులకి రిజర్వేషన్లు మాత్రం కావల్ల. కానీ సమాజంలో ఫలానా కులమని చెప్పుకోవడానికి చిన్నతనంగా ఫీలవుతారు. ఎవరు ఏ కులమని ఊర్లో, టౌన్లో చెప్పుకున్నా ఇట్లాంటి మునిదేవరలకి మాత్రం యాడున్నా వచ్చి తీరాల్సిందే. తెలిసి తెలిసి మునిదేవరకి రాకుండా వుండేవాళ్ళు చాలా తక్కువ. ఈ మునిదేవరకి వచ్చేదానికి పేదా గీదా అని తేడా లేదు. డబ్బుండే వాడైనా, లేనోడైనా ఒకటే. మునీశ్వరుడికి ఎవరూ కోపం తెప్పించాలని అనుకోరు. ఆయనకు కోపం తెప్పిస్తే ఇక అంతే సంగతులు''

అక్కడ చేరిన వాళ్ళల్లో రకరకాల వయసుల వాళ్ళు, రకరకాల ఆర్థిక స్థితులు గలవారు వున్నారు.

''ఇలాంటి పండుగలు ఈకాలంలో కూడా అవసరమా'' అనే ప్రశ్న ఒకటి అదివరకు మహేష్ గొంతులో తారాడుతూ వుండేది. ఇప్పుడా ప్రశ్న గొంతులోనే వుండిపోయింది.

మునీశ్వరుడి పైన పసుపు, కుంకుమ, పూలు వర్షం లాగా కురుస్తుంటే అదురుతూ బెదురుతూ వున్న మేకపోతును ఒడిసి పట్టుకున్నాడు గోవిందు. హారతినిచ్చి, కొబ్బరికాయ కొట్టి పసుపు కుంకుమ మళ్ళీ పెట్టి అప్పుడే మంచి నీళ్ళతో కడిగి, నీళ్ళు కారుతున్న పదునైన కత్తిని తయారుగా ఎత్తి పట్టుకున్నాడు రాజేంద్ర.

''ఒక్క వేటుతో తల తెగిపోవాల్లా నాయాలా. ఎట్లా కొడతావో చూడల్ల. ఆ పిలకాయల్ని దూరం తీసుకుపోండి. రక్తం చూసి భయపడే వాళ్ళుంటే దూరం జరగండి. ఊ..గురి చూసుకో.. ఎత్తు.. ఎత్తురా''

మట్టెన్న ఊగిపోతూ ఉత్సాహపరుస్తుంటే రాజేంద్ర చేతిలోని కత్తి కసుక్కున కిందకు దిగి మేకపోతు తలను వేరు చేసింది.

తల తెగి దూరంగా పడింది. నాలుగు కాళ్ళు గిలగిలా కొట్టుకుంటుంటే దాన్ని చూడలేక మహేష్ కళ్ళు మూసుకున్నాడు కాసేపు.

మేకపోతు తలను మునీశ్వరుడి ముందుంచి అందరూ చేతులు జోడించి, కళ్ళు మూసుకుని దండం పెట్టుకుంటుంటే అక్కడికి కోడిపుంజు, కోడిపెట్ట విగత శరీరాలు వచ్చి చేరాయి.

పిల్లలందరికీ అక్కడే గుండ్లు కొట్టి చెవులు కుట్టి చెవిపోగులు తగిలించారు. ఈ తతంగం జరుతున్నంతసేపూ పిల్లలిద్దరి ఏడుపుని సముదాయించడానికి వాళ్ళమ్మ నానా తంటాలు పడుతోంది.

''ఇంటి దగ్గర భోజనాలు ఏర్పాటు చేస్తున్నాం. అందరూ అక్కడికి వచ్చి భోంచేయండి'' ఎవరో పెద్దాయన బిగ్గరగా అరచి చెబుతున్నాడు.

అరుణ్ అన్న చదివింపులు, బహుమతుల లిస్టు రాసుకునే పనిలో పడి, భోజనాల సంగతి చూడండ్రా అని అరుణ్‌కు ఆ పని పురమాయించగానే మిత్రబృందం అక్కడి నుంచి కదిలింది.

అరుణ్ వాళ్ళింటి ముందు షామియానా కింద అప్పటికే వంటవాళ్ళు టేబుల్స్, కుర్చీలు సిద్ధంగా వుంచారు. ''ఏమేం చేస్తార్రా భోజనానికి. మేకపోతు ఇంకా రాలేదుకదా ఇక్కడికి'' అని అడిగాడో స్నేహితుడు.

''మునీశ్వరుడి ప్రసాదం కాబట్టి ఆ మేకపోతు మాంసాన్ని వండి అందరూ ఖచ్చితంగా తినేసి ఊర్లకు బయలుదేరుతార్రా. అప్పటి దాకా పస్తులెందుకని పప్పుచారు, వంకాయల కూర చేయించాం. రా విస్తర్లలో వడ్డిద్దాం. జనం వచ్చేస్తారు'' అంటూ వాచీ చూసుకుని అందర్నీ తొందరపెట్టాడు అరుణ్.

అన్ని విస్తర్లని కడిగి తాళింపు, అప్పళం, అన్నం, సాంబారు వేసేలోగా జనం వచ్చేశారు. అప్పటికి టైం రెండున్నరవుతుంటే అందరూ ఆకలితో ఉన్నట్లున్నారు. గుంపులు గుంపులుగా వచ్చేశారు విస్తర్ల ముందుకి.

గోనె సంచిలో వేసి తీసుకు వచ్చిన మేకపోతు శరీరంలోంచి తోలును వలిచి శుభ్రం చేసే పనిలో పడ్డారు కొందరు. దిష్టి తగలకుండా చుట్టూ పాత దుప్పట్లతో పరదాని అప్పటికప్పుడు ఏర్పాటు చేసుకున్నారు.

''చూసినావా అబ్బయా. గుంపు ఎంత పెద్దగా వుండాదో. మనిషి పుట్టినప్పుడు, చచ్చినప్పుడు రాని వాళ్ళంతా మునిదేవరకి యాడుండే పనులాడ బెట్టేసి ఎలబారి వచ్చేస్తారు. దూరాభారం అనుకోరు. ఈ పండుగలో వుండే విచిత్రం అదే కదా'' అన్నాడు గోవిందు మహేష్ దగ్గరికొచ్చి నిలబడి.

''భోంచేశావాన్నా''

మహేష్ ప్రశ్నకు లేదన్నట్లు తలూపి, ''ఈ పూట మనికి వంకాయ రుచించదు. ఇంకెంత, గంటలో కూర రెడీ అయిపోతుంది. మళ్ళింక భోంచేస్తాలే'' అనేసి అక్కడి నుంచి కదిలాడు గోవిందు.

''మనం తిందామా ఆకలేస్తుంది'' అన్నాడొకడు మహేష్ భుజం పైన చెయ్యేసి. ఆర్థిక అసమానతల్ని దాటి కులం కాదు దేవుడంటే వుండే భయం కలిపిన బంధువుల సమూహాన్ని, వాళ్ళ కోలాహలాన్ని విస్మయంగా, అబ్బురంగా చూస్తున్నాడు మహేష్.

అతడికేదో కొత్తగా అర్థం అవుతున్నట్లు అనిపించింది. అక్కడే నిలబడి భోంచేయడం కూడా మరిచిపోయి గుంపు వైపు చూస్తుండిపోయాడు.

★

